# పోలా ప్రగడ రాజ్యలక్ష్మి నవలలు – పరిచయం:

ఆచార్య జి. అరుణకుమారి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

పోతా ప్రగడ వారి ఆడపడుచు రాజ్యలక్ష్మి పోలాప్రగడ వారి కోడలయ్యింది. ఈమె తల్లి దండ్రు లకి తొమ్మిదవ సంతానం . ఆరుగురు అక్కలు, ముగ్గురు అన్నలు . మగ పిల్లవాడు పుడతాడను కుంటే ఆడపిల్ల పుట్టింది. కొడుకు పుడతాడనుకొని రామాలయం కట్టించారు. రాముడు పుట్టలేదు సరికదా సీత పుట్టింది. సూర్యుని చూడందే తల్లి భోజనం చేసేది కాదట. అందుకే రాజ్యలక్ష్మి గారి అసలు పేరు సూర్యరామ సీతా రాజ్యలక్ష్మి. పుట్టింటి వారు రామసీత అని పిలిస్తే , మెట్టినింటి వార ు రాజ్యలక్ష్మి అని పిలిచారు. పోలా ప్రగడ సత్యనారాయణమూర్తి గారి సతీమణి రాజ్యలక్ష్మి గారు 14 నవలలు, వంద కథలు, వంద కవితలు, రేడియో ప్రసంగాలు, జీవిత చరిత్ర రాసి అనేక అవా ర్డులు పొందారు.

మన తెలుగు సాహిత్యంలో సాహితీ సృజన చేసిన దంపతులున్నారు.

1. పుట్టపర్తి నారాయణాచార్యులు– నారాయణమ్మ
2. బుచ్చిబాబ–సుబ్బలక్ష్మి
3. ఆరుద్ర– రాజ్యలక్ష్మి
4. చందూర్–మాలతి
5. ఆర్.ఎస్. సుదర్శనం– వసుంధర
6. ఆచంట జానకీరాం–శారదాదేవి
7. ఇంద్రగంటి శ్రీకాంత్శర్మ–జానకీబాల
8. ముదిగంటి గోపాలరెడ్డి–సుజాతరెడ్డి
9. అబ్బూరి వరదరాజేశ్వర రావు–ఛాయాదేవి
10. పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి–రాజ్యలక్ష్మి

రాజ్యలక్ష్మిగారికి పై చదువులకి ఆటంకం కలిగితే నన్నయకు, కాళిదాసుకు, షేక్స్ఫియర్ కు డిగ్రీలున్నాయా! సాహిత్య సృజన పూర్వజన్మ ఫలం. చిత్త శుద్ధి వలన సంప్రాప్తమవుతుంది అని అనేవారు పోలా ప్రగడ సత్యనారాయణ మూర్తిగారు. ఈ విధంగా రామ సీతా రాజ్యలక్ష్మి గారు రవ ్యకథా రచయిత్రియై సీతారామ కీర్తనలు రాసి భక్తి సామ్రాజ్యలక్ష్మి అయ్యారని ముక్తేవి భారతిగారనా న్నరు.

1964లో ‘ ఏమైనా సరే కథ రాయాలి’ తో మొదలైంది రాజ్యలక్ష్మిగారి రచనా ( పారంభం . ఆంధ్రజ్యోతి మాస పత్రికలో అచ్చయ్యింది. ఆనాడు మొదలైన లేఖిని ఈనాటి వరకు జీవ నదిలా సాహిత్యాన్ని సృష్టిస్తూనే ఉంది. విశ్వనాథ, ఎస్వీ జోగారావు, కనపర్తి వరలక్ష్మమ్మ గారి (

పశంసలు వీరి సాహిత్య ఆరోహణకి ప్రేరకాలు. నాగార్జున విశ్వవిద్యాలయంలో కథలు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నవలలు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెల్లుపొదలు (హిందీ) తెలుగు , హిందీ విభాగాలలో ఎంఫిల్, పీహెచ్‌డీ లు వచ్చాయి.

శరన్మేఘం 1973, శ్రుతితప్పిన వీణలు 1975, దరిచేరిన కెరటం 1975, గాజు మేడ 1976, విరిసిన వెన్నెల 1977, ఇటు ఊరు అటు ఏరు 1984, ప్రేమాలయం 1985, కొత్త చిగుళ్ళు- మంచు బిందువులూ 1985, శిలలూ సెలయేళ్ళు 1986, రెల్లు పొదలు 1994, బంగారు కెరటాలు (వందేళ్ళ నాటి ఇతివృత్తం). రచయిత్రిగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గగన కుసుమాలు, మమతల పందిరి కనుమరుగయ్యాయి. పత్రికా సిబ్బంది నిర్లక్ష్యం వలన, సబ్ ఎడిటర్లు మారడం వల్ల ఇవి అలభ్యాలు అయ్యాయి. రెల్లు పొదలు కూడా అదే స్థితిలో ఉన్నా రెండు సంవత్సరాల తర్వాత పొత్తూరి వెంకటేశ్వరరావుగారు డైలీ సీరియల్‌గా వేయడానికి సంసిద్ధత చూపించారు. ఒక రచయిత్రి రచనలు ముద్రణలోకి రావటానికి ఆరంభంలోనే ఎదుర్కొంటున్న సమస్యలు ఎలా ఉంటాయే తెలుసుకోవచ్చు. 73 ఏళ్ళ జీవితంలో ఆమె చేసిన సాహితీ ప్రస్థానం గురించి చెబుతున్నాను.

**1. శరన్మేఘం :**

మధ్యతరగతి వర్గాల జీవిత చిత్రణ, స్త్రీ పురుష స్నేహం అనుమానాలకు తావివ్వడం, రోగ గ్రస్థుడైన భర్త అనుమాన రోగంతో బాధపడటం. భార్య సునంద సంసార జీవితం చక్కబెట్టుకునే క్రమంలో ఎదుర్కొన్న సంఘర్షణలు. ఒక వంతు తల్లుల భాధ్యత కూడా ఉందని చెబుతారు ఈ నవలల్లో. చిన్న పాత్రలుగా కనిపించినా ఆ పాత్రల ప్రభావం అధికంగా (విషబీజాలు నూరిపోయడం) కనిపిస్తుంది. బహుమతిగా ఇచ్చిన చీర అనర్థాలకు దారి తీస్తుంది. సహనమే సంస్కృతి అనే దానికి ప్రతిరూపం ఈ నవల.

**2.శ్రుతి తప్పిన వీణలు**

మేనమామ ప్రసక్తి తేవడం వలన వివాహ జీవితానికి అనర్థం. అనుమానమే ప్రధాన కారణం. సంప్రదాయం –స్వేచ్ఛా జీవనాల మధ్య రెండు పాత్రలు కనిపిస్తాయి. ఉన్నతమైన చదువులు చదివి పెళ్ళిపట్ల విముఖత చూపే స్త్రీల పరిస్థితి ఈ నవలల్లో కనిపిస్తుంది.

**3. గాజుమేడ:**

వివాహ వ్యవస్థ ఇచ్చే రక్షణ విలువైందని, స్త్రీ పురుషులు కలిసి జీవించడం సరైనది కాదంటారు రచయిత్రి. స్త్రీ హృదయం గాజు మేడ వంటిది.

**4. శిలలూ–సెలయేళ్ళు**

అక్క కూతురిని వాసవి కూతురుగా భావించి సంసారం ఇబ్బందుల పాలవ్వడం ఈ నవలలో వస్తువు, సుధ వలన అపార్థం కలిగినా ఆమె వల్లనే భార్యాభర్తలు కలిసి పోతారు. స్త్రీ తన సమస్యలను తానే పరిష్కరించుకోవాలి. జీవితం మీది ప్రేమతో మాతృత్వాన్ని సైతం గణించక మోసకారి అయిన మగవాణ్ణి నమ్మితే స్త్రీ జీవితం కడగండ్ల పాలవుతుంది. జీవితంలో అడ్డంకుల్ని శిలలుగా ప్రేమను సెలయేరుగా భావించి నిష్కల్మష ప్రేమ అన్ని అవరోధాలను అధిగమిస్తుందంటారు రచయిత్రి

**5.దరిచేరిన కెరటం**

అహంకారంతో అత్తవారింట అడుగు పెట్టని యువతి పడిన కష్టాలకు అక్షరరూపం దరి చేరిన కెరటం. తండ్రి జలజకు మరో పెళ్ళి చేస్తాననటం మాట పట్టింపు, వైవాహిక జీవితంలో ఒక్క తప్పటడుగు వేసినా దాని ప్రభావం తరువాతి జీవితంలో చాలా భాగం మీద ప్రసరిస్తుందని ఈ నవలలో తెలియచేశారు. సన్నివేశ కల్పన ప్రధానాంశ పోషణగా కనిపిస్తుంది.

**6.విరిసిన వెన్నెల**

అమాయకులు సహృదయులైన వ్యక్తులకు ప్రతిభావంతులైన సంతానం కలుగుతుందని రచయిత్రి భావన. దీనికి ఉదాహరణ నాగి పాత్ర. పిల్లల మంచికైనా, చెడుకైనా పెద్దల పెంపకమే ప్రధానాంశానికి సహకరించే అంశం.

**7.ఇటు ఊరు- అటు సెలయేరు**

గోడకు అలంకారంగా ఉన్న చిత్రపటం ఈ నవలకు స్పందన. పెంచిన ప్రేమలో గాఢతను వివరిస్తుంది. ఈ నవల ప్రతీకాత్మకంగా చిత్రింపబడింది. సంసారానికి, భక్తికి మధ్య సాగిన సంఘర్షణ. చిత్ర లేఖనం డాడాయిజం, క్యూబిజం, ఫ్యూచరిజం, ఇంప్రెషనిజం... వంటి యిజాలకు ఆధారమైంది .రచయిత్రి తన ఎదుట ఉన్న చిత్రపటానికి స్పందించి రూపొందించిన నవల ఇది.

**8. కొత్త చిగుళ్ళు - మంచు బిందువులు**

కొత్త చిగుళ్ళు- మంచుబిందువులు నవల నాగార్జున విశ్వవిద్యాలయం వారి ఉన్నవ లక్ష్మీనారాయణ అవార్డును 1988లో పొందింది. తండ్రి పోతా ప్రగడ బలరామమూర్తి గారికి అంకితమిచ్చారు. పంచకావ్యాలు, ప్రబంధాలు చదువుకున్న యోగీంద్రయ్య సంస్కృత విద్యకు ఆదరణ తగ్గి ఇంగ్లీష్ చదువులకు వెళ్ళిపోవడం, భుక్తి గడవక యాచనకు దిగిన ఓ పండితుడు అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను రక్షించి జీవన రక్షాపథక్ అవార్డు పొందడానికి అర్హుడవుతాడు.

ఏ కులం, ఏమతం వాళ్లయినా పేదవాళ్ళంతా ఒకటే అనే అభిప్రాయానికి వస్తాడు. అంటరం, మడి వదిలేసి మంచి చెడులను మాత్రమే చూస్తాడు. ధర్మోరక్షితి రక్షిత: అనే లోకోక్తికి నిదర్శన ప్రాయుడిగా యోగీంద్రయ్య పాత్ర చిత్రించారు.

**9. ప్రేమాలయం:** ఇందులో దాంపత్య జీవితాన్ని చక్కగా వివరించారు.

**10. రెల్లు పొదలు :** అస్సాం ఉద్యమాన్ని ప్రధానంగా చేసుకొని వచ్చిన నవల. ఒక్క తెలగు ప్రాంతమే కాదు మిగిలిన రాష్ట్రాల సాహితీ సంస్కృతులు అందులో భాగాలని కూడా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తు చేసిందీనవల. ఆంధ్రప్రభ దినపత్రిక వారు 1989లో ధారావాహికంగా ప్రచురింపబడింది. ఒక వైపు అస్సాం అల్లర్లు, మరో వైపు ప్రశాంత ప్రకృతిని జతచేసి రూపొందించిన నవల.

1951 తర్వాత అస్సాం రాష్ట్రంలో ప్రవేశించిన విదేశీయుల్ని పంపించి వేయాలని ఆందోళన జరిగింది . 1985 ఆగష్టు 15న అస్సాం ఆందోళనకు తెరపడింది. 1979లో ప్రారంభమైన ఆందోళన 1983లో బలవంతపు ఎన్నికలతో తీవ్రరూపం దాల్చి, 1985 వరకు ఉద్యమం కొనసాగింది. అస్సామీయుల జీవితాన్ని చిత్రించారు. అస్సామీయేతరులను బహిష్కరించాలం

టూ ఆరేళ్ళ పాటు సాగిన  ఉద్యమం ఇది. ఉద్యమ స్వభావాన్ని కళాఖండంగా అందించే శక్తి కొద్ది మందికే ఉంటుంది.  అస్సాము అంటే అసోము జాతీయులుండేది అని అనుకుంటాము. రామయణ కాలంలో దీనిని ప్రాగ్జ్యోతిషం అని, భారత కాలంలో కామరూప్ అని అనేవారట.  ప్రతిరాష్ట్రం ఒక పుష్పమని, దేశమంతా ఒక పూలహారమని  అనే భావన కలిగి ఉండాలి.  మంచి నవల రాయడం చాలా కష్టం. రాసినవన్నీ మంచివి కావడం మరీ కష్టం అన్నారు బెర్నాడ్‌షా. ఈ నవలలో  వైవిధ్య పాత్ర పోషణలో సామర్థ్యం, కథనంలో నేర్పరితనం సామాజిక ప్రయోజనం కనిపిస్తాయి.

సమస్త ప్రపంచాన్ని సాహిత్యమే మార్చలేదు. కానీ  మంచి వైపు మనసును మళ్ళించగలదు. విజ్ఞానాన్ని  వినోదాన్ని ఇవ్వగలిగేది సాహిత్యం.

ఆచార్య జి. అరుణకుమారి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.